# ఎన్నికల నియమావళిని పాటించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

ఆసిఫాబాద్, మార్చి 30: ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలు–2024లో భాగంగా ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు, 26వ తేదీన పరిశీలన, 29వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని చెప్పారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయని తెలిపారు. జూన్ 6న ఎన్నికల కోడ్ ముగుస్తుందని, అప్పటి వరకు కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వీసీలో కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఆర్డీవోలు కాసబోయిన సురేశ్, లోకేశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సం బంధిత అంశాల పర్యవేక్షణతో పాటు ప్రజలను ప్ర భావితం చేసే అంశాల నియంత్రణకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ జారీ కోసం సిబ్బంది వివరాలు సేకరించిట్లు తెలిపారు. వివరాలను ఎన్ఐసీ పోర్టల్ లో నమోదు చేసినట్లు చెప్పారు. సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోడల్ అధికారులు, తహసీల్దార్లు, తదితరులున్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, అదనపు కలెక్టర్లు



అవిశ్వాసాన్ని బలపరుస్తున్న ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు

## సిర్పూర్(టీ) ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

■ మద్దతుగా ఏడుగురు సభ్యుల ఓటింగ్

సిర్పూర్(టీ), మార్చి 30: సిర్పూర్(టీ) ఎంపీపీ చునార్కర్ సువర్ణపై సొంత పార్టీకి (కాంగ్రెస్) కు చెందిన ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్ బాబు ఆధ్వర్యంలో శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో 8 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఎంపీపీ సువర్ణ మినహా మిగతా సభ్యులు హాజరయ్యారు. అందరూ అవిశ్వాసానికి మద్దతుగా తమ ఓటు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో సురేశ్ బాబు ప్రకటించారు. అవిశ్వాస తీర్మాన పత్రాలను జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, సీఐ సాధిక్ పాషా, ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కుష్టు నివారణకు కృషి చేయాలి

**జిల్లా అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్**

వాంకిడి,మార్చి 30: కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలని జిల్లా అదనపు డీఎంహెచ్ వో సుధాకర్ నాయక్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ దవాఖానను శనివారం తనిఖీ చేశారు. కుష్టువ్యాధి అనుమానిత కేసులను ఆయన పరీక్షించారు. కుష్టు వ్యాధి లక్షణాలను క్లుప్తంగా వివరించారు. అనుమానం ఉంటే స్థానిక ప్రభుత్వ దవాఖానకు వచ్చి వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. సకాలంలో వైద్యం చేయించుకుంటే మేలని పేర్కొన్నారు. వైద్యాధికారి ఉప్రే వినయ్, విస్తరణ అధికారి రవిదాస్, సిబ్బంది తదితరులున్నారు.

## ముమ్మరంగా పన్నుల వసూలు

వాంకిడి, మార్చి 30: మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూలును ముమ్మరం చేశారు. పంచాయతీ కార్యదర్శి శివ కుమార్ శనివారం బిల్ కలెక్టర్‌తో కలసి ఇంటింటికీ తిరిగి పన్ను వసూలు చేశారు. ఇప్పటి వరకు 80 శాతం పన్ను వసూలయ్యిందని, మరో రెండు రోజుల్లో మిగిలినవి వసూలు చేస్తామని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు సకాలంలో పన్ను చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమని తెలిపారు.

## కాగజ్‌నగర్‌లో 5కే రన్

కాగజ్‌నగర్, మార్చి 30: కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ఎస్పీఎం క్రీడా మైదానం వరకు శనివారం 5కే రన్ నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ జెండా ఊపి 5 కే రన్ ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ రన్‌ను నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆర్డీవో సురేశ్ కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ సీఐ శంకరయ్య, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



జెండా ఊపి 5 కే రన్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

## రన్ ఫర్ జీసస్

కాగజ్‌నగర్, మార్చి 30: కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి లారీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, మార్కెట్ ఏరియా, ఎస్‌బీఐ బాంక్, ఎస్పీఎం క్రీడా మైదానం, చింతగూడ చౌరస్తాల మీదుగా రన్ ఫర్ జీసస్ కొనసాగింది. ప్రత్యేక గుడ్ ఫ్రైడే మరుసటి రోజు క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా చౌరస్తాల్లో ఏసుక్రీస్తు శాంతి సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత గురువులు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రన్‌ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రిస్టియన్లు

## క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజం

**- వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్**

వాంకిడి, మార్చి 30: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న నితిన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన డైలీ క్రికెట్, నాని సెలక్షన్ జట్లకు నిర్వాహకులతో కలిసి ఆయన శనివారం ట్రోఫీతో పాటు నగదు అందజేశారు. విన్నర్‌కు రూ.20 వేలు, రన్నర్‌కు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో అశోక్, అరుణ్, అన్వర్ హుస్సేన్ తదితరులున్నారు.



ట్రోఫీ ని అందజేస్తున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్



ఉపాధి కూలీలకు నీడ కల్పిస్తున్న అధికారులు

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

■ దహెగాం ఎంపీడీవో రాజేందర్

దహెగాం,మార్చి 30: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. పనులు చేసే చోట కూలీల కోసం ప్రథమ చికిత్స కిట్, తాగునీరు, నీడ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయవద్దని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించినట్లు తెలిపారు. సౌకర్యాలు లేని చోట కూలీలు తమ దృష్టికి తేవాలని కోరారు.

## గుర్తు తెలియని రైలు నుంచి పడి వ్యక్తి మృతి

సిర్పూర్(టీ), మార్చి 30 : సిర్పూర్(టీ) రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు నుంచి పడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దిలీప్ కుమార్ సింగ్ (22) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌లోని గార్వా జిల్లా టెనర్ గ్రామానికి చెందిన మేస్త్రీ కూలీ దిలీప్ కుమార్ సింగ్ బిలాస్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు గుర్తు తెలియని రైలులో ప్రయాణం చేస్తుండగా, ప్రమాదవశాత్తు సిర్పూర్(టీ) రైల్వే స్టేషన్ సమీపంలో కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ ఆధారంగా దిలీప్ తల్లి తండ్రులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు.

## సింగరేణి ఉద్యోగులకు స్వీటు బాక్సులు అందజేయాలి

■ టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు



వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన, మార్చి 30: సింగరేణి ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులందరికీ స్వీట్ బాక్సులు అందించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు యాజమాన్యాన్ని కోరారు. ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ జీఎం కార్యాలయ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మంకయ్య, కేంద్ర కమిటీ నాయకులు ధరావత్ మంగీలాల్, ఏరియా నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, రాజేశం, సుగ్రీవులు, తదితరులున్నారు.

## పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, మార్చి 30: కాకతీయ యూనివర్సిటీ దూర విద్యా కేంద్రంలో ఓపెన్ డిగ్రీ, పీజీ అన్ని గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ జాకీర్ ఉస్మానీ ఒక ప్రకటన లో తెలిపారు. పూర్తి వివరాల కోసం రెబ్బెన మండల కేంద్రంలోని కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి

రెబ్బెన, మార్చి 30: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. రెబ్బెనలో శనివారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.



వ్యవసాయ చేనులో పెరిగిన జీడి చెట్టు



జీడి పండ్లు ఏరుతున్న ఆదివాసీ మహిళ

## అడవి బిడ్డల సొంతం అటవీ ఫలాలు..

■ జీడి పండ్లతో శరీరధారుడ్యం

■ ఏటా సేకరిస్తున్న ఆదివాసీలు

కెరమెరి, మార్చి 30: అటవీ ఫలాలు అడవి బిడ్డలకు కొదవలేకుండా పోయింది. యేటా ఎండకాలంలో దొరికే అటవీ ఫలాలను సేకరిస్తూ కొత్త రుచులను ఆస్వాదిస్తున్నారు. ప్రస్తుతం జీడి పండ్ల సేకరణలో ఆదివాసీలు బిజీగా మారారు. చెట్టు చివరి కొమ్మలపై జీడి గింజ, దానికి ఆనుకొని కాయ కాసిన అనంతరం కొద్ది రోజులకు అది పసుపు రంగులో పండుగా మారుతుంది. వెదురు కంకతో వాటిని తెంపి సేకరిస్తారు. నల్లగా ఉన్న గింజల నుంచి జాగ్రతగా పండును తుంచి ఆరాబెట్టి తింటారు. అప్పటికప్పుడే తినాలంటే అగ్గిమంటల్లో కాల్చుకొని చల్లబడ్డ తర్వాత తింటే ఎంతో రుచికరంగా ఉంటుంది. ఇదే తరహాలో ఇప్పపూలు, మొర్రిపండ్లు, తునికి పండ్లు వంటి అనేక రకాల అటవీ ఫలాలు ఆదివాసీల సొంతంగా మారాయి. అటవీ ఫలాలు తినడం వల్ల శరీరధారుడ్యానికి ఎంతో ఉపయోగపడుతాయని శాస్త్రవేతలు సూచిస్తున్నారు. అడవి బిడ్డలకు అటవీ సంపద వరంలా మారుతున్నది.

## భరోసా కల్పించడానికే బలగాల కవాతు

■ జైనూర్ సీఐ అంజయ్య

లింగాపూర్, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించడానికే పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించినట్లు జైనూర్ సీఐ అంజయ్య తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి కొత్తపల్లి, కంచన్‌పల్లి, గుంనూర్ మీదుగా సీఆర్‌పీఎఫ్ బలగాలు, 200 మందికి పైగా పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. సమస్యాత్మక ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు సీఆర్‌పీఎఫ్ సీఐ బద్రి ప్రసాద్, లింగాపూర్, జైనూర్, సిర్పూర్(యూ) ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, సందీప్ కుమార్, మాధవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## అక్రమ దందాలు చేస్తే కఠిన చర్యలు



వీరభద్ర కాలనీలో మాట్లాడుతున్న సీఐ సాదిక్ పాషా

కౌటాల, మార్చి 30: మండలంలో ఎవరు అక్రమ దందాలు చేసినా చర్యలు తీసుకుంటామని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో కౌటాల ఎస్ఐ మధుకర్‌తో కలిసి శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అక్రమ దందాలకు పాల్పడినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. స్క్రాప్ గోదాంలను వారు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 20 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రతి వాహన దారుడు తప్పకుండా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, అంతే కాకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలను నడపరాదని ఆయన కోరారు. అక్రమ దందాలు, నిషేదిత మత్తు పదార్థాలు, తదితరాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

## వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

■ కెరమెరి ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి, మార్చి 30: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు వేసవిలో పలు జాగ్రతలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణారావు సూచించారు. మండలంలోని నాగల్‌గొంది గ్రామంలో శనివారం పర్యటించి కూలీలకు అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత పెరగడంతో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఉదయం పూట పనులకు వెళ్లి ఎండలు ముదరకముందే ఇంటికి చేరుకోవాలన్నారు. పనుల్లో కూలీల సంఖ్య పెంచడంతో పాటు పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా చేయాలని టీఏ, ఎఫ్ఏలకు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కూలీలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

## పట్టణాభివృద్ధికి సహకరించాలి

■ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు



అండర్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

కాగజ్‌నగర్, మార్చి 30: కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. పట్టణంలోని సంజీవయ్య కాలనీ వద్ద మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు నష్టం జరుగకుండా బ్రిడ్జి నిర్మాణ ప్లాన్ తయారు చేయిస్తామని తెలిపారు. రైల్వే లైను అవతల ఉన్న ప్రజలకు, పెద్దవాగు రోడ్డులో ఉన్న మోక్షధామంకు అనుసంధానంగా రైల్వే అండర్ బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సిలర్ ఎల్లేశ్, నాయకులు జాకీర్, దెబ్బెటి శ్రీనివాస్, ఉన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

రెబ్బెన, మార్చి 30: రెబ్బెన మండల కేంద్రానికి చెందిన గజ్జల భీంరావు(35) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. వివరాలిలి ఉన్నాయి. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన గజ్జల భీంరావు కు 2019 లో సునీత తో వివాహమైంది. కొంత కాలంగా ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని, ఏదైనా పని చేసుకోవాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి బెల్లంపల్లి దవాఖాకు తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## దళిత గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 30 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గని దళిత, గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు మేనేజర్ శ్రీధర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం గని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం పిట్ కమిటీ సభ్యుల వివరాలు మేనేజర్‌కు అందించి పరిచయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సింగరేణిలో సంతృప్తి కరంగా ఆర్ఓఆర్ అమలవుతుందని చెప్పారు. సింగరేణి సంస్థ ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎండీ బలరామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి రెడపాక లక్ష్మణ్, వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నక్క సుమన్, ఆర్కే 7 పిట్ కార్యదర్శి ప్రతాప్, నాయకులు నర్సింగారావు, శెట్టి శంకరయ్య, కమల్, మహేందర్, రాజ్‌కుమార్, తిరుపతి, వెంకటేశ్, వాసు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే ఉత్పత్తి లక్ష్యం సాధ్యం

శ్రీరాంపూర్, మార్చి 30 :శ్రీరాంపూర్ ఆర్కేన్యూటెక్ గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం సాధించడం కార్మికులు, అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమైందని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం గనిపై గని ఉత్పత్తి లక్ష్య సాధనపై జీఎం హర్షం వ్యక్తం చేస్తు కార్మికులను, ఉద్యోగులు, అధికారులను అభినందించి స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆర్కే న్యూటెక్ గనికి 2023–24 సంవత్సరానికి కేటాయించిన 1.60 లక్షల టన్నులను శుక్రవారంతో 100 శాతం సాధించడం అభినందనీయమన్నారు. న్యూటెక్ గని 2 సంవత్సరాలుగా 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నదన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఇదే స్పూర్తిని కొనసాగిస్తు గని లక్ష్యాలు సాధించాలని కోరారు. గైర్హాజరు లేకుండా విధులు నిర్వర్తించాలని కోరారు. సంపాదిస్తున్న మొత్తాలను వృథా చేసుకోకుండా వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు, ఏఐటీయూసీ ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, ఈఈ రాజారవిచరణ్, సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేశ్, ఈఈలు కృష్ణ, రాజగోపాలచారి, సర్వే ఆఫీసర్ పచ్చేశ్వర్‌రావు, అండర్ మేనేజర్ మిట్టపల్లి శ్రీనివాస్, శంకరయ్య, పరమేశ్వర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now

★ Experienced Supervisors Needed. 1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.

NT-10287-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

GST 5% వర్తించును

91827 77676, 91827 77679

91827 77671, 91827 77677